సాక్షి అనకాపల్లి

శనివారం । 11 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఆదివారం డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రత్యేక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వీలుగా ప్రతి శనివారం ప్రత్యేక బస్సు తిప్పుతున్నామన్నారు. శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపుతున్నామని, వారికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి పంచారామ క్షేత్రాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు.

బాణసంచా దుకాణాల వద్ద సకల జాగ్రత్తలు



దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ లైసెన్స్‌లు కలిగిన వ్యక్తులు మాత్రమే బాణసంచా దుకాణాలు నిర్వహించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక జీవీఎంసీ మున్సిపల్ క్రీడామైదానంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడైనా అనధికారికంగా మందుగుండు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. క్రీడా మైదానంలో దుకాణాల మధ్య 10 అడుగుల దూరం ఉండేలా చూస్తూ.. ఇసుక, నీరు, అగ్నిమాపకశాఖ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు దాడి మోహన్‌రావు, టి.శ్రీను సిబ్బంది, దుకాణదారులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీపై తనిఖీలు



విద్యార్థులతో మేనేజర్ శ్రీనివాసరావు

నర్సీపట్నం: విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాల పంపిణీ జరిగిందా? లేదా? అని పాఠశాల విద్యాశాఖ జిల్లా టెక్ట్స్ బుక్స్ విభాగం మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఆరా తీశారు. ఇందులో భాగంగా శుక్రవారం పలు పాఠశాల్లో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, శివపురం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠ్యపుస్తకాల పంపిణీపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో సీహెచ్ తలప్పులు, సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్, ఎంఈవో-2 నాగేంద్ర తదితరులున్నారు.



దేవరాపల్లి మండలం వాకపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

● అందుకే జగన్ కావాలి

ప్రజా పాలన ఎలా ఉండాలో చూపించారు.. సంక్షేమాభివృద్ధికి కొత్త అర్థం చెప్పారు.. నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎవరూ చేయలేనంత మేలు చేశారు.. అందుకే జగన్ కావాలి.. మళ్లీ సీఎంగా రావాలి.. అని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని వాకపల్లిలో శుక్రవారం ఉదయం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు గృహాలను సందర్శించారు. మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో అర్థవంతంగా వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన సంక్షేమ, అభివృద్ధి నిరాటంకంగా కొనసాగాలంటే మళ్లీ జగనే రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ధర్మశ్రీ పల్లె నిద్ర : జనంతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా చోడవరం సచివాలయం -1 పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. ధర్మశ్రీ శుక్రవారం రాత్రి ఈ ప్రాంతంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు, సంక్షేమాభివృద్ధి పనులపై వారి అభిప్రాయాలు సేకరించారు. తమ వార్డుల్లో ప్రధాన డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు ధర్మశ్రీకి వివరించారు. అంతకు ముందు ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉన్న రేషన్ డిపో నెం-4ను పరిశీలించారు. ఒకరి ఇంట్లో భోజనం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి రాత్రి అక్కడే బస చేశారు.

- దేవరాపల్లి, చోడవరం



చోడవరంలో పల్లె నిద్ర చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సీఎం కృషి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

పాయకరావుపేట: రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలో శ్రీరాంపురం వద్ద పాయకరాని చెరువులో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో కలిసి ఆయన 25,600 చేప పిల్లలను విడిచి పెట్టారు. వీటిలో శీలావతి, బొచ్చు రకాల పిల్లలు ఉన్నాయి. అనతరం బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోను, మార్కెట్లలోను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రా ఫిష్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, మత్స్యకార సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతా గురునాథరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వై.అన్నవరం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవవరపు వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, ఫిషరీష్ మండల అధికారి శృతి పాల్గొన్నారు.



పాయకరాని చెరువులో చేపపిల్లలను విడిచి పెడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

కొండకర్ల ఆవలో చేప పిల్లల విడుదల

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవలో ఎమ్మెల్యే కన్నబాబురాజు 3.60 లక్షల చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆవపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు వీటి పెంపకం ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. ఎంతో విశాలమైన ఆవను పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్, జిల్లా మత్స్యకార అధ్యక్షుడు గురునాథ్, మండల ఫిషరీష్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోన బుజ్జి, కోట్ని శివ, మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ, ఎంపీపీ జయలక్ష్మి, మునగపాక మండలాధ్యక్షుడు ఆడారి అచ్చింనాయుడు, ఎంపీటీసీ ఎస్.రాము, పిల్లి కనక అప్పారావు, మునగపాక పీఏసీఎస్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహన్‌రావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.



కొండకర్ల ఆవలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి

- రవాణా వాహనాలకు జీపీఎస్
- పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి

నర్సీపట్నం: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి తెలిపారు. ధాన్యం సేకరణ సన్నద్ధతపై తహసీల్దార్లు, రవాణా, వ్యవసాయ మార్కెటింగ్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లతో ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అవగాహన కల్పించి, కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. గత సీజన్‌లో ధాన్యం సేకరణలో ఎదురైన సమస్యలు పునరావృత్తం కాకుండా ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. గోనె సంచుల కొరత లేకుండా ముందుగానే అవసరమైన మేరకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాన్ని ముందుగానే అమర్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి మండలానికి మొబైల్ టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దళారుల బారిన పడకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సీఎస్‌డీటీ చందన తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన అధికారులు, సిబ్బంది

హైదరాబాద్ టు విశాఖ

- గ్రీన్ చానల్ ద్వారా ఆపరేషన్ పరికరాల తరలింపు

గోపాలపట్నం (విశాఖ): అత్యవసర సర్జికల్ డివైజ్‌ను విశాఖ విమానాశ్రయం నుంచి నగరంలోని ఇండస్ ఆస్పత్రికి గ్రీన్ చానల్ ద్వారా తరలించారు. చీడికాడ మండలం జిత్రవరానికి చెందిన సత్తిబాబు(52) అర్టిక్ ఎనూరిజమ్‌తో బాధపడుతూ.. ఇండస్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాన్ని శుక్రవారం హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ తీసుకొచ్చారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్ పర్యవేక్షణలో గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఎస్కార్ట్‌గా ఈ పరికరాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు సత్తిబాబు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు తీసుకు వస్తున్న ఆపరేషన్ డివైజ్

రీ సర్వేలో నిర్లక్ష్యంపై మునగపాక వీఆర్వో సస్పెన్షన్

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మునగపాక వీఆర్వో శేషగిరిరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు శుక్రవారం చేరాయి. భూ సర్వే పనుల్లో నిర్లక్ష్యంతోపాటు శేషగిరిరావుపై పలు ఫిర్యాదులు కూడా ఉన్నతాధికారులకు అందాయి. వీటన్నింటిపైనా విచారణ జరిపినట్లు తెలిసింది. ఈ నెల 8న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కూడా శేషగిరిరావు వైఖరి, విధుల్లో అలసత్వంపై నేరుగా కలెక్టర్‌కే ఫిర్యాదులు అందాయి. దీంతో సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ తాజాగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

దర్గాగా గెడ్డ కబ్జా



గెడ్డలో పెంచుతున్న కొబ్బరి మొక్కలు

- ఎర్రవరంలో ఓ భూస్వామి బరితెగింపు
- రూ.3.6 కోట్ల విలువైన 1.78 ఎకరాల గెడ్డ భూమి ఆక్రమణ
- మండల సమావేశంలో ప్రస్తావించినా.. చర్యలు శూన్యం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ భూముల పక్కన సాగు భూములున్న వారిలో కాస్త ఆశ పుడుతుంది. ఏటా సాగు సమయంలో గట్ల ముందున్న మట్టిని తొలగించి, అవతలి వైపు వేసుకుంటూ నెమ్మదిగా తమ విస్తీర్ణాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తారు. కానీ యలమంచిలి మండలం ఎర్రవరం రెవెన్యూ పరిధి లైన్‌కొత్తూరు పంచాయతీకి చెందిన ఓ భూస్వామికి మాత్రం ఆత్రం మరీ ఎక్కువయింది. గెడ్డ పోరంబోకు స్థలంతోపాటు గెడ్డలో కూడా కొంత భాగాన్ని ఆక్రమించుకున్నాడు.

మూడు మాసాల కిందట ఫిర్యాదు

ఈ భూ కబ్జా వ్యవహారంపై మూడు నెలల క్రితం యలమంచిలి మండల పరిషత్ సమావేశంలో వైస్ ఎంపీపీ రాజాన సూర్యచంద్రశేఖ(శేషు), లైన్ కొత్తూరు సర్పంచ్ కొల్లి రజని, మరి కొందరు సభ్యులు ప్రస్తావించారు. వారు సమావేశంలో చెప్పిన వివరాల మేరకు పంచాయతీ సర్వే నెం.94లో 13.29 ఎకరాల గెడ్డ పోరంబోకు స్థలం ఉంది. సర్వే నెం.95లో విశాఖకు చెందిన వ్యక్తికి 10.42 ఎకరాల్లో మామిడి తోట పెంచుతున్నారు. సర్వే నెం.94లో మరో సబ్‌డివిజన్‌లో 3.42 ఎకరాల జిరాయితీలో కూడా సదరు వ్యక్తి మామిడి మొక్కలు నాటారు. దీంతో తనకున్న 13.84 ఎకరాల తోటకు ఆనుకుని ఉన్న గెడ్డ పోరంబోకు స్థలాన్ని, కొంత మేర గెడ్డ(దొంగలగెడ్డ)తో సహా 1.78 ఎకరాలు ఆక్రమించుకున్నారు. అందులో జీడి మామిడి, కొబ్బరి మొక్కల్ని నాటి యథేచ్ఛగా అనుభవిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ధరల్లో దీని విలువ సుమారు రూ.3.60 కోట్లుగా ఉంటుందని అంచనా. సభ్యుల ఫిర్యాదు మేరకు మండల సర్వేయర్ స్పందిస్తూ తక్షణమే ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. మూడు మాసాలు గడుస్తున్నా ఇప్పటికీ చర్యలు శూన్యం.

సాగునీటికి ఆటంకం

సదరు ఆక్రమణదారు గెడ్డలోపలి నుంచి తన తోటలోకి రాకపోకలకు వీలుగా గ్రావెల్‌తో కొంత భాగం గెడ్డను పూడ్చి, రోడ్డు వేసుకున్నారు. వర్షాకాలంలో ఎగువనున్న కొండల నుంచి భారీ ఎత్తున వాననీరు ఈ గెడ్డ ద్వారానే ప్రవహించి మర్రిబంద బెహరదాస్ చెరువులోకి చేరుతుంది. ఈ చెరువు నీటినే ఈ ప్రాంత రైతులు తమ పంట పొలాలకు సాగునీరుగా వాడుకుంటున్నారు. ప్రస్తుతం గెడ్డ పొడవునా ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహం దారి మళ్లుతోంది. గెడ్డ నీటితో నిండాల్సిన చెరువు పూర్తి స్థాయిలో నీరు చేరక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా, బహిరంగంగా ఎన్ని ఆరోపణలు వస్తున్నా యలమంచిలి తహసీల్దారు కార్యాలయంలో కిందిస్థాయి సిబ్బంది ఉదాసీనతపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలు తొలగిస్తాం



ఎర్రవరం రెవెన్యూ లైన్‌కొత్తూరు పంచాయతీ పరిధి గెడ్డ ఆక్రమణలు మా దృష్టికి వచ్చాయి. దీనిపై సర్వే చేపట్టాలని ఇప్పటికే సిబ్బందిని ఆదేశించాను. ప్రాథమికంగా ఆక్రమణ ఉన్నట్టు తెలిసింది. సర్వే నివేదిక రాగానే పరిశీలించి, ఆక్రమణలు తొలగింపు చర్యలు తీసుకుంటాం. దీనిలో ఎలాంటి ఆరోపణలకు తావులేదు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పారదర్శకంగా పనిచేస్తున్నాం.

– ఎస్.రాణిఅమ్మాజీ, తహసీల్దార్, యలమంచిలి

క్లుప్తంగా

ఎస్పీకి మాజీ సైనిక ఉద్యోగుల కృతజ్ఞతలు



ఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీ ఎక్స్ నేవల్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణను ఏపీ ఎక్స్ నేవల్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 52వ బెటాలియన్ జమ్మూ కశ్మీర్‌లో పని చేస్తున్న ఆర్మీ జవాన్ సయ్యద్‌పై దాడి చేసిన పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్పీ సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో సస్పెన్షన్‌కు గురైన కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకుని శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని, స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు తమ సిబ్బందిపై పర్యవేక్షణ కలిగి ఉండాలని వారు కోరారు. లేనిపక్షంలో జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్రపతిని కలుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రబ్బీపాష, కార్యవర్గ సభ్యులు అమరపల్లి కృష్ణ కుమార్, పాపారావు, మూర్తి, వేణు, వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన విధానానికి దిక్సూచి ఆయుర్వేదం



ఆయుర్వేద వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానిస్తున్న నరసింహారావు

పాయకరావుపేట: ఆరోగ్యకరమైన జీవన విధానానికి దిక్సూచి ఆయుర్వేదమని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, కేరళలోని పూంతొట్టం ఆయుర్వేదాశ్రమ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పి.ఎం.ఎస్.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రపంచ దేశాలు ఆయుర్వేద వైద్య అవశ్యకతను గుర్తించి, ఈ విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆస్పత్రిలో ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్.వి.కె. నరసింహరావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం ఆయుర్వేద వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ పి.ఎమ్.ఎస్.రవీంద్రనాథ్, తమిళనాడు కోయంబత్తూరులోని సాయిగ్రామ్ ఆయుర్వేద హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆయుర్వేదం మన పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప సంపద అని చెప్పారు.

మరో సన్మాన గ్రహీత ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేదంతో మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని, నేడు మనం ఎదుర్కొంటున్న అనేక అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదం మాత్రమే సమాధానమిస్తుందని చెప్పారు.

ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్‌వీకే నరసింహారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన ఆయుర్వేద వైద్యాన్ని ఇక్కడ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతోనే ఇక్కడ చికిత్సాలయం స్థాపించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాష్, సమీరా దంపతులు, ఉపాధ్యాయ బృందం, శ్రీ ప్రకాష్ ఆయుర్వేద చికిత్సాలయ ప్రధాన వైద్యులు రమేష్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి



భవానీ(ఫైల్)

రోలుగుంట: కుటుంబ, అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలు తండ్రి దేముడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. మండలం జె.నాయుడునాలెం గ్రామానికి చెందిన దుర్గా భవానీ(20)కి రెండేళ్ల క్రితం మండలంలో కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన తవిటాల శ్రీనుతో వివాహం జరిగింది. శ్రీను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది తరువాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడాయి. రెండు నెలల క్రితం ఆమెకు అబార్షన్ జరిగింది. ఈ నేపథ్యంలో దుర్గాభవానీ కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి తట్టుకోలేక ఆమె ఈ నెల 7న ఇంట్లో ఉన్న వాహనానికి వినియోగించే బ్రేక్ అయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడి, అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు జంక్షన్‌లో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురాజుపేట గ్రామానికి చెందిన రమణను, కొరుప్రోలు గ్రామానికి చెందిన మణికంఠ బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. అందిన ఫిర్యాదు మేరకు 108 వాహనంలో క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

సేఫ్టీలో నంబర్ 1 వైజాగ్



తెలుగు తల్లి ఫ్లైఓవర్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరం రోడ్డు సేఫ్టీలో ముందంజలో ఉంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ నగరాలైన చెన్నై, పాట్నా, ముంబై నగరాలను సైతం పక్కకు నెట్టేసి నంబర్ వన్ స్థానాన్ని పొందింది. రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో ఏటా జరిగే రోడ్డు ప్రమాదాల నివేదికను ఈ మంత్రిత్వ శాఖ విడుదల చేస్తుంటుంది. దీని ప్రకారం పది లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల్లో 34.5 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ద్వారా మన విశాఖ నగరం మొదటిస్థానంలో ఉంది. 2021లో విశాఖ నగరంలో 2,339 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 2022లో 1,531 మాత్రమే జరిగాయి. 2021లో దేశంలో అత్యధిక ప్రమాదాలు జరిగిన 50 నగరాల్లో విశాఖ 2,339 ప్రమాదాలతో ఏడో స్థానంలో నిలిచింది. 2022లో అంతకుముందు సంవత్సరం (1,531 ప్రమాదాలు)తో పోల్చితే 808 ప్రమాదాలు 34.5 శాతంతో 22వ స్థానానికి వెళ్లింది. ఇక 2021లో రోడ్డు ప్రమాదాల్లో 368 మంది (15వ స్థానం) చనిపోగా, 2022లో ఆ సంఖ్య 358కి (18వ స్థానం) తగ్గింది. అలాగే ఈ ప్రమాదాల్లో గాయపడిన వారి సంఖ్య 2021లో 1,533 మంది (14వ స్థానం) కాగా, 2022లో 1,228 (22వ స్థానం)కి తగ్గారు. ఇక ప్రమాదాల తగ్గుదలను పరిశీలిస్తే.. 31.4 శాతంతో చెన్నై రెండో స్థానం, 28.4 శాతంతో పాట్నా మూడో స్థానం, 15 శాతంతో ముంబై నాలుగో స్థానంలో ఉన్నాయి.

అతివేగం ప్రమాదాలే అధికం

విశాఖ నగరంలో 2022లో జరిగిన అత్యధిక రోడ్డు ప్రమాదాలకు అతివేగమే కారణమని ఆ నివేదిక తేల్చింది. మొత్తం 1,531 ప్రమాదాల్లో 1,228 (83.14 శాతం) అతివేగం వల్లే జరిగాయని పేర్కొంది. ఈ ప్రమాదాల్లో 301 మంది మరణించగా 1,842 మంది గాయపడ్డారు. అలాగే రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం ద్వారా జరిగిన 27 ప్రమాదాల్లో తొమ్మిది మంది మృత్యువాత పడగా, 26 మంది గాయపడ్డారు. ప్రమాదాల్లో అత్యధికంగా 1,017 సరళ రహదారిపైన, 111 ప్రమాదాలు రోడ్ల మలుపుల్లో, 473 జంక్షన్ల వద్ద, 11 కల్వర్టులపైన జరిగాయి. ద్విచక్ర వాహన ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంది. 791 బైక్ ప్రమాదాల్లో 179 మంది చనిపోగా, 748 మంది గాయపడ్డారు. 51 ఆటో ప్రమాదాల వల్ల 13 మంది, 30 లారీ ప్రమాదాల్లో ఏడుగురు, 18 బస్సు ప్రమాదాల్లో నలుగురు, 418 ప్రమాదాల్లో 105 మంది పాదచారులు, ఇతర ప్రమాదాల్లో మరో 50 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇక ఈ ఏడాది కూడా రోడ్డు ప్రమాదాల తగ్గుదల గణనీయంగానే ఉంది. 2022 ఆగస్టు వరకు 1,226 ప్రమాదాలు జరగ్గా ఈ ఏడాది ఆగస్టు ఆఖరు వరకు 766 రోడ్డు ప్రమాదాలు (37.52 శాతం తక్కువ) మాత్రమే జరిగాయి. ఇక మరణాల సంఖ్యను చూస్తే 2022 ఆగస్టు వరకు 362 మంది చనిపోగా, ఈ ఏడాది అదే సమయానికి 207 మంది (42.8 శాతం తక్కువ) మృత్యువాత పడ్డారు.

- ప్రమాదాల తగ్గుదలలో దేశంలో విశాఖ టాప్
- ఏడాదిలో 34.5 శాతం తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- ఆ తర్వాత స్థానాల్లో చెన్నై, పాట్నా, ముంబై
- 2021లో 2,339 ప్రమాదాల్లో 368 మంది మృత్యువాత
- 2022లో 1,531 యాక్సిడెంట్లలో 358కి తగ్గిన మరణాలు
- రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ నివేదిక వెల్లడి

రెండేళ్లలో రోడ్డు ప్రమాదాల వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	గాయాలు
2021	2,339	368	1,533
2022	1,531	358	1,288

సంయుక్త తనిఖీలతో సత్ఫలితాలు



రవాణ, పోలీసు, జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సంయుక్తంగా తరచూ ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, నిబంధనల ఉల్లంఘనపై రోజూ కేసులు నమోదు చేస్తున్నాం. ఒక్క డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే 4200కి పైగా నమోదు చేశాం. రోడ్డు ప్రమాదాలపై జంక్షన్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల్లో సత్వరమే ఆస్పత్రులకు తరలిస్తున్నాం. వీరిని రక్షించిన వారికి రూ.5 వేలు రివార్డు ఇస్తున్నాం. 'విజన్ జీరో' నినాదంతో పనిచేస్తున్నాం. రోడ్ల విస్తరణ, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటుకు రూ.21 కోట్లు వెచ్చించాం. ఇవన్నీ వెరసి విశాఖలో రోడ్డు ప్రమాదాలు, మరణాల తగ్గుదల సాధ్యమైంది.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



పల్లా కోనారి(ఫైల్)

అనకాపల్లిటౌన్: గొల్లపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్.నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో కోడూరు గ్రామానికి చెందిన పల్లా కోనారి(80) గొల్లపేట గ్రామం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కోనారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, కుమార్తె ఉరికిటి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు



పాన్ షాపును తనిఖీ చేస్తున్న చోడవరం సీఐ, ఎస్‌ఐలు

చోడవరం రూరల్: పట్టణంలోని ఒక పాన్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ శివారు శేషు పెట్రోల్ బంక్ వద్ద ఉన్న పాన్ షాపులో బొడ్డి రామలక్ష్మి అనే మహిళ మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని, పది క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. నిందితురాలిని అరెస్టు చేసి చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎస్.రాయవరం విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రేవతి, హెచ్‌ఎం నిరోసా

ఎస్.రాయవరం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. నర్సీపట్నం మండలం వేములపూడి ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చెప్పారు.అండర్ 14 వ విభాగంలో కె.వర్షిణి,అండర్ 17విభాగంలో జి.వాహినిలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

నాతవరం: విద్యతో పాటు ఆటపాటలు విద్యార్థులకు చాలా అవసరమని డి.యర్రవరం సంస్కృతి స్కూల్ కరస్పాండెంట్ రేవతి, హెచ్‌ఎం జి.నిరోసా తెలిపారు. ఈనెల 9న నర్సీపట్నం మండలం వేములపూడి హైస్కూల్‌లో నిర్వహించిన బేస్ బాల్ పోటీల్లో సంస్కృతి పాఠశాలకు చెందిన డి.నూకరాజు, ఆర్.వసికర్‌నాయుడు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో సత్కరించి, అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ఏఎంఏఎల్ విద్యార్థినుల ప్రతిభ



క్రీడాకారిణులతో కళాశాల అధ్యాపకులు

అనకాపల్లి రూరల్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాలికల వాలీబాల్ పోటీల్లో ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థినులు ప్రతిభకనబరిచారు. ఇటీవల విశాఖ వీఎస్ కృష్ణా కళాశాల జరిగిన బాలికల వాలీబాల్ టోర్నీలో ఏఎంఏఎల్ కళాశాలకు చెందిన కె.సాయి స్రవంతి, సీహెచ్ రామలక్ష్మి, ఏ.భాగ్యశ్రీ, పి.దేవి, ఎం.లావణ్య, ఏ.దీపిక, ఎస్.అనూష పాల్గొన్న జట్టు ప్రథమస్థానం కైవసం చేసుకుంది. విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న పలు కళాశాలల నుంచి జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు విద్యార్థినులకు అభినందించారు. తమ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.జయబాబు తెలిపారు. ఏయూ వాలీబాల్ జట్టులో స్థానం పొందిన కె.సాయి స్రవంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కొల్లూరి ఎస్.ఎన్. మంగరాజు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు కె.రమేష్, వి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కెవీఎస్ మహేశ్వరరావు, సూపరింటెండెంట్ పి.అనూరాధ,ఫిజికల్ డైరెక్టర్లు కె.వి.ఎస్. నాయుడు, వై.నాయుడు,స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దిబ్బిడిలో అతిసార రోగులకు వైద్య సేవలు



గ్రామంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణ



వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడి గ్రామంలో అతిసార రోగులకు వైద్య సేవలందించారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకు నుంచి వచ్చిన కలుషిత నీరు తాగడం వల్ల పలువురు గ్రామస్తులు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై ఒకరు మృతి చెందిన విషయం విదితమే. దాంతో బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 124 మందికి వైద్య సేవలందించారు. పది మంది వరకు అతిసారతో బాధపడుతున్నట్లు గుర్తించారు. బాధితులు సియాద్రి నాయుడుబాబు, కేశంశెట్టి నూకరాజు, గొన్నాబత్తుల పార్వతి, వియ్యపు సత్యనారాయణ, తుంపాల మాలిబాబు తదితరుల ఇళ్లకు తమ సిబ్బందితో కలిసి వెళ్లి పరీక్షలు చేశారు. మంచినీటి ట్యాంకును పరిశీలించి నీటి శాంపిల్ సేకరించారు. ట్యాంకు నీరు బాగానే ఉన్నట్లు గుర్తించారు. ఇంటింటికీ వేసిన కుళాయి కనెక్షన్లకు సంబంధించి పైపులకు లీకేజీలుండటం వల్ల అతిసార వ్యాపించి ఉండొచ్చని భావిస్తున్నారు. సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, నాయకులు భూషణం, పంచాయతీ సెక్రటరీ కూర్మారావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవరు మృతి





సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగేంద్ర (ఇన్‌సెట్), మృతిచెందిన రమేష్(ఫైల్)

దేవరాపల్లి: తెనుగుపూడి రోడ్డులో గురువారం రాత్రి ఆటో బోల్తా పడి, మారేపల్లి గ్రామానికి చెందిన డ్రైవరు పంపాన రమేష్(32) మృతిచెందాడు, ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న తెనుగూపూడి గ్రామానికి చెందిన ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సీఐ తాతారావు, ఎస్‌ఐ నాగేంద్ర శుక్రవారం పరిశీలించారు. మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. క్షత్రగాతుడు బయ్యవరపు బాలాజీ తెలిపిన వివరాలు... దేవరాపల్లి నుంచి ఆయనతో పాటు తమ గ్రామానికి చెందిన అర్జున, పోతురాజు కలిసి రాత్రి 10 గంటల ప్రాంతంలో రమేష్‌కు చెందిన ఆటోలో తెనుగూపూడి బయలుదేరారు. మార్గ మధ్యంలో కొల్లివారి కళ్లాలు దాటిన తర్వాత ప్రమాదకర మలుపులో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. డ్రైవరు రమేష్ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్ మృతిచెందాడు. గాయపడిన వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మృతుడికి ఏడాది వివాహం జరిగింది. ఆటో నడుపుతూ తన భార్య జ్యోతితో పాటు తల్లిదండ్రులను పోషిస్తున్నాడు.

వైఎస్సార్ మహిళా భవనం ప్రారంభం



మహిళా భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: చీడిగుమ్మలలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ మహిళా భవనాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం కోసం ప్రభుత్వం రూ.10 లక్షల మంజూరు చేసిందని, ఈ ప్రాంతంలో ఉన్న డ్వాక్రా సభ్యులకు భవనం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. చీడిగుమ్మల-2లో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు స్కామ్‌లు చేసి ప్రజలను మోసం చేస్తుంటే, సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిరంతం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కాపారపు చిన్నబ్బాయి, లెక్కల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోహం ఆశ్రమంలో ధన్వంతరి పూజలు



ధన్వంతరి పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: మండలంలో బట్లపూడి గ్రామం సోహం ఆశ్రమంలో శుక్రవారం ధన త్రయో దశి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. పంచలోహ అన్నపూర్ణమ్మ విగ్రహానికి పంచామృతాభిషేకం, ధన్వంతరి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు రవి, సర్పంచ్ భర్త గొంతిన సత్యారావు, భక్తులు పాల్గొన్నారు.


అటవీ అమర వీరులకు ఘన నివాళి



అమర వీరుల పేర్లతో ఉన్న బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

అనకాపల్లిటౌన్: డివిజన్ అటవీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అటవీ అమర వీరుల దినోత్సవం జరిగింది. ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.జ్యోతిర్మయి అమర వీరుల పేర్లతో ముద్రించిన బ్యానర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు ఎం.గోవింద, ఎం.సంజీవరావు, ఆర్‌వీఆర్ వసంత, బి.యాదగిరి, ఇ.శివ, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కె.అప్పారావు, సిబ్బంది జి.సంతోష్, బి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.







వెలుగుల పండగకు వేళాయె

- ఊరూ వాడా దీపావళి శోభ
- బాణసంచా విక్రయాల జోరు

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండగను హిందువులు ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం దీపావళి పండగ నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. బాణసంచా వెలుగులతో జీవితాన్ని ఆనందమయం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. పట్టణ, మండల ప్రాంతాల్లో ప్రమిదలు, బాణసంచా దుకాణాలు భారీగా ఏర్పాటయ్యాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

అనకాపల్లిటౌన్: దీపావళి సందడి మొదలయింది. పట్టణ, మండల ప్రాంతాల్లో బాణసంచా విన్యాసాలకు ప్రజలు సిద్ధమయ్యారు. లక్ష్మీపూజలకు ఆలయాలు, బాణసంచా విక్రయాలకు దుకాణాలు ముస్తాబవుతున్నాయి. దీపావళి అమావాస్య పురస్కరించుకుని చెరకు గడలతో పూజలు చేసేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పట్టణానికి దీపావళి శోభ

దీపావళి వస్తుందంటే ఉమ్మడి విశాఖలో అనకాపల్లి పేరే గుర్తుకొస్తుంది. దీనికి ప్రధాన కారణం బాణసంచా తయారీ కేంద్రాలు అనకాపల్లిలో ఉండడమే. నాణ్యమైన తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, పటాసులు తయారీకి ఈ ప్రాంతం చాలా ప్రసిద్ధి. ఇక్కడి బాణసంచా కేంద్రాలకు పలు ప్రాంతాల నుంచి భారీగా జనాలు వస్తుండటంతో ఆ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎన్టీఆర్ క్రీడామైదానం, రింగ్‌రోడ్డులో బాణసంచా విక్రయాలకు ప్రభుత్వం రెండు రోజుల అనుమతులిచ్చింది. క్రీడామైదానంలో 42, రింగ్‌రోడ్డులో ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు ముందు భాగంలో ఆరు దుకాణాలు ఏర్పాటయ్యాయి. ముంగిట దీపాలు వెలిగించేందుకు ప్రమిదలను విక్రయించే స్టాళ్లతోపాటు, కిరాణా దుకాణాల వద్ద కూడా విక్రయాలు మొదలయ్యాయి. ఇప్పటికే కుమ్మరి వ్యాపారులు భారీ స్థాయిలో ప్రమిదలను మార్కెట్లో అమ్మకానికి పెట్టారు. శనివారం, ఆదివారాల్లో వీటి విక్రయాలు తారాపథానికి చేరతాయని వ్యాపారులు చెబుతున్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు



రింగ్‌రోడ్డులో బాణసంచా దుకాణాలు



బాణసంచా అమ్మకాలను ప్రారంభిస్తున్న నర్సింగరావు

డీసీఎంఎస్‌లో బాణసంచా విక్రయాలు

స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో శుక్రవారం సంస్థ చైర్మన్ పల్లా నర్సింగరావు బాణసంచా విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ధరలకే మందుగుండు సామాగ్రిని అమ్మకానికి ఉంచామన్నారు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రజలు కొనుగోలు జరిపి, తమకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఐవీ రమణమూర్తి, డైరెక్టర్లు పీడీ గాంధీ, బొడ్డు గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచాతో జాగ్రత్త

- దీపావళి పండగ అంటేనే బాణసంచా వెలుగులు.. పటాసుల పేలుళ్లు. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ఇబ్బందులు తప్పవు. అందుకే బాణసంచా కాల్చేటపుడు అప్రమత్తంగా ఉండాలంటూ నిపుణులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.
- పేలని, సగంలో ఆగిపోయిన టపాసులను మరోసారి వెలిగించే ప్రయత్నం చేయొద్దు.
- బాణాసంచాను ఎప్పుడూ బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలి. ఇంట్లో కాల్చేందుకు ప్రయత్నించవద్దు.
- చేత్తో, గాజు సీసాలు, లోహపు పాత్రల్లో టపాసులు కాల్చడం ప్రమాకరం.
- బాణసంచా కాల్చే వాళ్లు వదులుగా ఉండే, కాటన్ దుస్తులనే ధరించాలి.
- కాల్చిన బాణసంచా సామాగ్రిని ఇసుక పోసి ఓ ప్లాస్టిక్ బకెట్‌తో కప్పి ఉంచండి. దీనివల్ల ఆ దారిలో వెళ్లేవారి ప్రమాదం ఉండదు.
- టపాసులు కాల్చేటపుడు ఆ ప్రాంతంలో ముందుజాగ్రత్తగా బక్కెట్‌తో నీటిని దగ్గర్లో ఉంచుకోవడం తప్పనిసరి.
- పిల్లల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వారిని పెద్దలు తమ వద్దనే ఉంచుకుంటూ వారితో పేలని, కేవలం వెలుగులు మాత్రమే వచ్చే సామగ్రిని కాల్చనివ్వాలి.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు



ఇందిరా కాలనీ నుంచి భవానీకాలనీకి నిర్మిస్తున్న డ్రైనేజీ

కశింకోట: స్థానిక ఇందిరా కాలనీ నుంచి భవానీకాలనీ వరకు రూ.15 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకమహాలక్ష్మి వీధిలో మదుం నిర్మాణ పనులను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని రహదారులు, డ్రైనేజీలు, సెంటర్ లైటింగ్ అభివృద్ధిలో భాగంగా అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేసేందుకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్, ఏఈ ఎం.శ్రీనివాసరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీ-1 సెక్షన్ పరిధిలో నర్సింగరావుపేట, చవితినవీధి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఏరియా, న్యూబర్మాకాలనీ, జీవీ కోటేశ్వరరావు వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సామాజిక సాధికార బస్సుయాత్ర సక్సెస్

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సుయాత్రకు భారీగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు వచ్చిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులను అభినందించారు. సభ నిర్వహణకు సహకరించిన ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రి అందిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు, కెనరా బ్యాంకు ఉద్యోగులు

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సబ్బవరంలోని కెనరా బ్యాంకు సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా క్రీడా సామగ్రి కిట్‌లు సమకూర్చింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, బ్యాంకు సీనియర్ మేనేజర్ నుపూర్ చౌదరి వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు కిట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ముందస్తు దీపావళి వేడుకలు



డైట్‌లో దీపాలంకరణ వద్ద విద్యార్థులతో సిబ్బంది



కిడ్స్ ప్లే స్కూల్లో దీపాలు వెలిగించిన చిన్నారులు

అనకాపల్లిటౌన్: పర్యావరణం కలుషితం కాకుండా మట్టి ప్రమిదలతో దీపావళి వేడుకలు నిర్వహించుకోవాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత బాణసంచా, మట్టి ప్రమిదలతో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. అంతకుముందు మండల ఆర్ట్స్, దియా పెయింటింగ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

హ్యాపీ కిడ్స్‌లో..

స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లేస్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు జరిగాయి. దీపాలు వెలిగించి చిన్నారులు ఉత్సాహంగా గడిపారు. అంతకుముందు కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ దీపావళి పండగపై చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీటితో ఇక్కట్లు



టెలిఫోన్ ఎక్చేంజ్ వీధిలో రహదారిపై నిలిచిన మురుగునీరు

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రహదారిపైకి మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారి వెనుక డ్రైనేజీ నిర్మాణ పనులు రెండు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. మందకొడిగా సాగుతున్న డ్రైనేజీ పనులతో స్థానిక షిర్డీసాయిబాబా ఆలయం ముందు రహదారిలో మురుగునీరు నిలిచిపోయింది. ఆలయానికి వచ్చే భక్తులతోపాటు అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సమయంలో జీవీఎంసీ సిబ్బంది మోటారు సహాయంతో మురుగునీటిని తొలగించినప్పటికీ సాయంత్రానికి మరలా రహదారి బురదమయంగా మారుతోంది. ఈ సమస్య ఇంకా ఎన్నాళ్లు భరించాలని స్థానికులు వాపోతున్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: సంక్షేమ పథకాల అమల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని ఆరిపాక సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే/పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నవారిని పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గుర్తించి సంక్షేమ పథకాలకు చేరువచేయడం జరుగుతుందన్నారు. మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఇటువంటి అభివృద్ధి, సంక్షేమం అందించిన ప్రభుత్వాలను చూడలేదన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సుమారు రూ.29 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా నేరుగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్న జగనే మన రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, నాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, కర్రి బాబు, బోకం రామునాయుడు, శరగడం రాము, సబ్బవరపు నారాయణమూర్తి, బొడ్డేటి మహాలక్ష్మినాయుడు, మళ్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, ఎస్‌పీ రాజు, బండారు రమణ, ఐడీ బాబు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక శ్రద్ధ

వైద్య సిబ్బందికి ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా నిర్వహించాలని ఎంపీడీవో రమేష్ నాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రభుత్వ ఆస్పత్రుల ఆరోగ్య కార్యకర్తలతో శుక్రవారం ఈ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న సుమారు 90 మందిని ప్రత్యేక చికిత్స కోసం రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. వలంటీర్ల సహకారంతో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి తగిన మందులు సిఫార్సు చేయడం లేదా ఆస్పత్రులకు తరలించడం చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో గ్రామ వలంటీర్లు సహకరించని ఎడల తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి కుటుంబానికి ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రచారం నిర్వహించాలన్నారు. కుటుంబ సభ్యులు నిరక్షరాస్యులు అయితే ఆ యాప్‌ను ఆరోగ్య కార్యకర్తలే వారి ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలని రమేష్ నాయుడు ఆదేశించారు. సమావేశంలో ఏవో షేక్ బాబూరావు, ఈవోఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న వ్యవస్థాపకతపై అవగాహన

అనకాపల్లిటౌన్: స్థానిక డైట్ కళాశాలలో వినూత్న వ్యవస్థాపకత(ఇన్నోవేటివ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్)పై స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ మద్ది గంగాధర్ గుప్తా మాట్లాడుతూ వ్యవస్థాపకులుగా మారాలనుకుంటే ఎలాంటి గుణగణాలు ఉండాలి, ఎలాంటి ఆటిట్యూడ్ అలవరచుకోవాలనే అంశాలపై వివరించారు. ప్రస్తుతం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేషన్, స్టార్టప్‌ల ఫండింగ్ అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. దీని ద్వారా దేశం గర్వించదగ్గ ఉన్నత ఆవిష్కరణలు సాధించవచ్చని చెప్పారు. ప్రస్తుత దేశ ప్రధాని ప్రవేశపెట్టిన స్టార్టప్ ఇండియా-స్టాండ్ అప్ ఇండియా కార్యక్రమం ద్వారా ఇస్తున్న ఆర్థిక సహకారాలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.దేవీప్రసాద్, స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ వై.హేమంత్‌కుమార్, అసోసియేట్ డీన్ అకడమిక్స్ ఎ.కృష్ణనాగ్ పాల్గొన్నారు.







